## అదనపు కలెక్టర్‌కు వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు

కామారెడ్డి, మార్చి 20 : అగ్రవర్ణ పేద కుటుంబాల నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వర్తింపజేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విక్టర్‌కు రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వాలు మారినా రాష్ట్రంలో అగ్రవర్ణాల పేదల బతుకులు మారడంలేదని అన్నారు. కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి, రెడ్డి ఐక్యవేదిక కోర్ కమిటీ చైర్మన్ నాగిర్తి రెడ్డి, జిల్లా నాయకులు రాజారెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సారెడ్డి, రవీందర్ రెడ్డి, సతీశ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్ రెడ్డి, కిషన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి, మాణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేత



విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఉద్యోగులు

కామారెడ్డి, మార్చి 20 : తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓ విద్యార్థికి గురువారం ఆర్థికసాయం అందజేశారు. జిల్లా కు చెందిన క్రాంతిరాజ్ అనే పీహెచ్‌డీ విద్యార్థి ఆర్థిక పరిస్థితుల కారణంగా యూనివర్సిటీ ఫీజు బకాయిలతోపాటు అంతిమ పరీక్ష ఫీజు కూడా చెల్లించలేదు. డాక్టరేట్ పట్టా పొంది తన ఉజ్వలమైన భవిష్యత్తు, ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశిమ్ చేతుల మీదుగా రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గైక్వాడ్ తులసీదాస్ మాంగ్, ప్రొఫెసర్ రామేశ్వర్‌రావు, భీంరాజ్, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బీబీపేట్(దోమకొండ), మార్చి 20 : దోమకొండ మండలంలోని అంబారీపేట గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయడం కోసం బీబీపేటకు సకాలంలో చేరుకోవడానికి ఉచితంగా ఆటో రవాణా సౌకర్యం కల్పించడానికి అదే గ్రామానికి చెందిన అరుట్ల అనిల్ ముందుకు వచ్చాడు. అంబారీపేట నుంచి బీబీపేట వరకు ఉచితంగా ఆటో సౌకర్యం కల్పిస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అరుట్ల అనిల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలి

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, మార్చి 20 : ప్రజలకు ఈ వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డితో కలిసి తాగునీటి సమస్య, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 48 గ్రామాలకు 53.36 లక్షల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఐదు కొత్త ట్యాంకర్లు కొనుగోలు చేస్తున్నామని, పాతవి మూడు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే మరో నాలుగు ట్యాంకర్లు కొనుగోలు చేస్తామన్నారు. ఇక ముందు తాగునీటి ఇబ్బందులు, అవసరమైన పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని మిషన్ భగీరథ ఈఈ, జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ నుంచి కామారెడ్డి వరకు డీఐ కొత్త పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు తాగునీటి కోసం రోడ్డెక్కకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ముందస్తు ప్రణాళికలతో నీటి సరఫరా అయ్యేలా స్థానిక, ఉన్నతాధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. అవసరమైన ప్రతిపాదనలు స్థానిక అవసరాలను బట్టి స్పష్టంగా ఒకే ఫార్మాట్‌లో సిద్ధం చేయాలని సూచించారు. వచ్చే జూన్ మాసం వరకు నీటి సమస్యలు రాకుండా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి మురళీ, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కొలతల ప్రకారం పనులు చేయాలి

బాన్సువాడ రూరల్, మార్చి 20 : కొలతల ప్రకారం పనులు చేయాలని ఏపీవో భిక్షపతి కూలీలకు సూచించారు. బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల అటెండెన్స్ మస్టర్లను ఆయన తనిఖీ చేశారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో ఉపాధిహామీ పనులు చేసేందుకు కూలీలు తరలివస్తున్నారు. బోర్లం, హన్మాజీపేట్, ఇబ్రహీంపేట్, కోనాపూర్, తాడ్కోల్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఆయన వెంట టీఏ గోపాల్, ఎఫ్ఏ గణేశ్ తదితరులు ఉన్నారు.

## అగ్నికి ఆహుతైన చెట్లు



తిమ్మాపూర్ గ్రామ శివారులో కాలిపోయన చెట్లు

నస్రుల్లాబాద్, మార్చి 20 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని గుట్టకు బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకున్నది. తిమ్మాపూర్, మల్లాపూర్ గ్రామ శివారులో గత ఏడాది ఉపాధి హామీలో నాటిన సుమారు ఐదు వేల మొక్కలు కాలిపోయినట్లు ఇన్‌చార్జి సెక్రెటరీ మోహన్ తెలిపారు.

## 25న తైబజార్ వేలం

బాన్సువాడ టౌన్, మార్చి 20 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 25వ తేదీన తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార సంత, రోజువారి, పశువులు, మేకలు, గొర్రెల సంతను మంగళవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చన సూచించారు.

## చెరువులో పడి మహిళ మృతి

నస్రుల్లాబాద్, మార్చి 20 : బీర్కూర్‌కు చెందిన మదారి గంగామణి(32) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ గురువారం తెలిపారు. మృతురాలు ఈ నెల 18వ తేదీన చెప్పులు కొనేందుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో 19వ తేదీన బంధువుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని, గ్రామ శివారులోని అంకుశ్‌గాన్ చెరువు వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**చికిత్స పొందుతూ వ్యక్తి..**

నస్రుల్లాబాద్, మార్చి 20 : బాన్సువాడ మండలం రాంపూర్ తండాకు చెందిన కేతావత్ హరిసింగ్ బాన్సువాడ దవాఖానలో చిక్సిత పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. ఈ నెల 17వ తేదీన మల్కాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. నస్రుల్లాబాద్ మండలం కంశెట్‌పల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. వెంటనే 108 వాహనంలో బాన్సువాడ దవాఖానకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ దవాఖానకు తరలించారు. అక్కడ నుంచి మళ్లీ బాన్సువాడ దవాఖానకు తరలించగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేత

నస్రుల్లాబాద్, మార్చి 20 : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ మాధవరావు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం నిర్వహించిన అండర్-14 జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఈశ్వర్, రాణాప్రతాప్, దేవిదాస్, అండర్-16లో అనిల్, రాహుల్, అండర్-18లో ప్రతాప్, వికాస్, వెంకటేశ్, జగదీశ్, అండర్-20లో సతీశ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు ప్రవీణ్, అశ్విన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఇద్దరిపై కేసు నమోదు

భిక్కనూరు, మార్చి 20 : మండల కేంద్రంలోని ఓ ద్విచక్ర వాహనం షోరూంకు వెళ్లి, విలేకరులమని చెప్పి డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన లింగాల నవీన్ గౌడ్, వి అర్జున్ ఆన్‌లైన్ వార్త పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల మని చెప్పి భిక్కనూరులోని సిద్ధరామేశ్వర ద్విచక్రవాహన షోరూంలోకి వెళ్లి యజమానిని, మహిళా సిబ్బందిని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము చెప్పినట్లు వినకపోతే ఇబ్బందులకు గురిచేస్తామని బెదిరించారు. షోరూం ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభం

బీబీపేట్, మార్చి 20 : మండలంలోని తుజాల్‌పూర్‌లో బస్టాండ్ వద్ద అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్, ఉపాధ్యక్షులు నాగరాజ్, రమేశ్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు, లారీ సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లు, లారీ

మాచారెడ్డి, మార్చి 20 : పాల్వంచ మండలంలోని బండరామేశ్వర్‌పల్లి, వాడి గ్రామాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌తోపాటు పాల్వంచలో ఇసుక లారీని సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లతోపాటు ఒక లారీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని గ్రామాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## విద్యుత్ సబ్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం

మాచారెడ్డి, మార్చి 20 : పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఎండవేడికి కెపాసిటర్లు కాలిపోయాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి అధికారులకు సమాచారం అందించి మంటలను ఆర్పివేశారు. సిబ్బంది వెంటనే అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని వెల్పుగొండ ట్రాన్స్ కో ఏఈ జ్యోతి తెలిపారు. విద్యుత్ సరఫరా పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

## టెక్సాస్ వర్సిటీతో టీయూ ఎంవోయూ

డిచ్‌పల్లి, మార్చి 20 : కమ్యూనిటీ కళాశాలల విద్యార్థులు పరిశోధన చేయడానికి అమెరికాలోని టెక్సాస్ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. అవగాహన ఒప్పందంపై టీయూ వీసీ యాదగిరిరావు, టెక్సాస్ వర్సిటీ వీసీ ఆచార్య బొబ్బిలి అనంత సుధాకర్ గురువారం సంతకాలు చేసి ఒప్పంద పత్రాలు మార్పిడి చేసుకున్నారు. ఈ సందర్భంగా అమెరికా టెక్సాస్ వర్సిటీ వీసీ ఆచార్య బొబ్బిలి అనంత సుధాకర్ తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు టెక్సాస్ వర్సిటీలో పరిశోధన చేయడానికి అవగాహన ఒప్పందం చేసుకోవడాన్ని స్వాగతించాలన్నారు. తెలంగాణలో విశిష్టమైన సహజ వనరులను ఉపయోగంలోకి తీసుకువచ్చి రాష్ట్ర అభివృద్ధికి ఈ పరిశోధనలు ఉపయోగపడుతాయని తెలిపారు. దేశ విద్యాలయాల్లో టీయూతో ఒప్పందం కుదుర్చుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల వ్యవహరించారు.

## ‘మున్సిపాలిటీలో మా గ్రామాన్ని కలుపొద్దు’



నిరసన తెలుపుతున్న గోపన్‌పల్లి గ్రామస్తులు

బిచ్కుంద, మార్చి 20 : నూతనంగా ఏర్పాటు కాబోతున్న బిచ్కుంద మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని కలపొద్దని గోపన్‌పల్లి గ్రామస్తులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి తమ గ్రామం 5 కిలోమీటర్ల దూరం ఉంటుందని, అంతకంటే తక్కువ దూరంలో ఉన్న గ్రామాలను కలపకుండా తమ గ్రామాన్ని కలపడం రాజకీయ దురుద్దేశంతో జరుగుతున్నదని విమర్శించారు. గ్రామంలో రైతులు, కూలీలు ఎక్కువగా ఉన్నారని, వారంతా ఉపాధి హామీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. మున్సిపాలిటిలో తమ గ్రామాన్ని చేర్చితే పన్నులు పెరగడమే కాకుండా.. బతికేందుకు ఉపాధి పనులు లేకుండా పోతాయని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం గ్రామస్తులంతా కలిసి మండల కేంద్రానికి చేరుకొని తహసీల్దార్ వేణుగోపాల్‌కు మున్సిపాలిటీ నుంచి తమ గ్రామాన్ని మినహాయించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గంగాధర్ పటేల్, వినోద్ గౌడ్, విశ్వనాథ్ తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పన్ను వసూలు వేగవంతం చేయాలి

లింగంపేట, మార్చి19: గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని ఎంపీవో మల్లారీ గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని బాయంపల్లి, బాణాపూర్, కోర్పోల్, ఎల్లారం గ్రామాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. ఇప్పటి వరకూ వసూలు చేసిన పన్నుల, వసూలు చేయాల్సిన వివరాలు కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్లారం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులు పరిశీలించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★ I, KURMASETTY GANGADHAR (Old Name) S/o. SHETTY GANGARAM I, Changed my name as SHETTY GANGADHAR (New name) S/o. SHETTY GANGARAM, H.No. 1-70/A, Village: Palem, Mdl: Morthad, Dist. Nizamabad. and my correct date of Birth is 01-01-1986 my wrong Date of Birth is 15-04-1986.
NTZ- 338567

**WANTED**

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

**BUILDING FOR SALE**

★ New RCC Building 2BHK ,H:No 4-2-21 built in 484Sq.yard plot for Sale @ 70 Lacs, near :DSP Office, Opp: Vani Vidyanikethan School, Shakar Nagar, Bodhan, Mob: 9960996111. Gulf NRI's , Employees, Business person can contact directly.
NTZ-338564

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ‘వయ్యారి భామ’ నిర్మూలనపై అవగాహన

### పోచారం గ్రామస్తులకు అవగాహన కల్పించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



గ్రామ చావిడి వద్ద వయ్యారి భామ మొక్కల నిర్మూలనపై వివరిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నాగిరెడ్డిపేట, మార్చి 20: పోచారం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం విద్యార్థులు చేపడుతున్న జాతీయ సేవా పథకంలో భాగంగా గురువారం వయ్యారి భామ మొక్కల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వయ్యారి భామ నిర్మూలన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ నినాదాలు చేశారు. అనంతరం మురుగుకాలువల పక్కన పెరిగిన పొదలు, గడ్డిని తొలగించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజిత శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి తిరుపతి, ఎన్ఎస్ఎస్ అధికారులు రంజిత, రమ్య, విఠల్, పరుశురామ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక కార్యాలయం ప్రారంభం



పెద్దచెరువు కట్టపై మినీ ట్యాంక్‌బండ్ పనులు పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిరూరల్, మార్చి 20: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన భవన నిర్మాణ కార్మిక రంగ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమది సంక్షేమ ప్రభుత్వమని, బీదల పక్షాన ఉం టుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమి టీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాయకు లు సామెల్, పద్మ శ్రీకాంత్, పప్పు వెంకటే శం, భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్ఈడీ స్ట్రిప్ విద్యుత్ దీపాల ప్రారంభం..**

పట్టణంలోని రోడ్డు డివైడర్‌పై 147 విద్యుత్ స్తంభాల సుందరీకరణకు ఏర్పాటుచేసిన ఎల్ఈడీ విద్యుత్ దీపాలు పాతవి కావడం, మరికొన్ని ఎల్ఈడీ దీపాలు పనిచేయకపోవడంతో మున్సిపల్ ఆధ్వర్యంలో వాటిని తొలగించి నూతన ఎల్ఈడీ స్ట్రిప్ దీపాలు ఏర్పాటు చేశారు. వాటిని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు స్విచ్చాన్ చేసి ప్రారంభించారు.

**ఎల్లారెడ్డి మినీ ట్యాంక్‌బండ్ పనుల పరిశీలన..**

పట్టణంలోని పెద్దచెరువు కట్టపై కొనసాగుతున్న వాకింగ్ ట్రాక్, దానిపై ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ట్యాంకుబండ్‌ను అందంగా తయారు చేయాలన్నది తన లక్ష్యమని పేర్కొన్నారు.

### ప్రభుత్వ దవాఖానను సందర్శించిన

## కాయకల్ప బృంద సభ్యులు



పిట్లం ప్రభుత్వ దవాఖానను పరిశీలిస్తున్న కాయకల్ప బృంద సభ్యులు

పెద్ద కొడప్‌గల్ (పిట్లం),మార్చి 20 : పిట్లం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను గురువారం కాయకల్ప బృందం సభ్యులు పరిశీలించారు. దవాఖానలో స్వచ్ఛత, సదుపాయాలు, బయోమెడికల్ వేస్టేజీ, వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పని తీరు తదితర అంశాలను పరిశీలించారు. దవాఖాన ఆవరణలో శుభ్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, వీటి ఆధారంగానే ప్రోత్సాహకాలు అందించనున్నట్లు బృందం సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రవీంద్రమోహన్, సివిల్ అసిస్టెంట్ ప్రవీణ్, హెడ్ నర్సు శిరీష పాల్గొన్నారు.

## ఫైనాన్స్‌లో చోరీకి యత్నం

లింగంపేట, మార్చి 20: మండల కేంద్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫైనాన్స్ తలుపులు దహనం చేసి చోరీకి విఫలయత్నం చేశారు. గ్రామంలోని నగరేశ్వర ఆలయం వద్ద జక్సాని శ్రీహరి అనే వ్యక్తి ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తుంటాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫైనాన్స్ తలుపులకు పెట్రోల్ పోసి నిప్పంటించారు. విషయాన్ని గుర్తించిన స్థానికులు యజమానికి సమాచారం అందించగా, స్థానికుల సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఘటనా స్థలాన్ని రాత్రి పోలీసులు సందర్శించినట్లు ఫైనాన్స్ యజమాని తెలిపారు. గతంలోనూ ఇదే ప్రాంతంలో చోరీకి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు అపహరించి, దుస్తులు దహనం చేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే చేరండి



ఇంటర్ పరీక్షలు రాసి బయటికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 20: లక్షలాది ఫీజులు చెల్లించి ప్రైవేటు కళాశాలల్లో చేరవద్దని, మంచి నాణ్యమైన విద్యనందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే చేరాలని అధ్యాపకులు ఇంటర్ విద్యార్థులకు సలహానిచ్చారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ కళాశాల పరీక్ష సెంటర్ వద్ద ఇంటర్ పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులతో డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు సురేశ్‌రెడ్డి, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు మోహిన్ మాట్లాడారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో క్వాలిఫైడ్ అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతున్నదన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆకర్షణలకు లోను కాకుండా, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయకుండా, మంచి విద్య లభించే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు.

## రైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేత

గాంధారి, మార్చి 20: మండలంలోని జువ్వాడి గ్రామానికి చెందిన బద్దం సాయిరెడ్డి అనే రైతు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించాడు. సదరు రైతు గాంధారి సహకార సంఘంలో పంట రుణం తీసుకోవడంతోపాటు అతడికి జేపీఏ బీమా పాలసీ ఉన్నది. బీమా పాలసీకి సంబంధించిన లక్ష రూపాయల చెక్కును గురువారం విండో చైర్మన్ పెద్దబూరి సాయికుమార్ బాధితుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్, విండో డైరెక్టర్లు తాడ్వాయి సంతోష్, గాండ్ల లక్ష్మణ్, శివాజీ, గణపతి, సీఈవో సాయులు తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్య శిబిరం

రామారెడ్డి (సదాశివనగర్), మార్చి 20: సదాశివనగర్ ప్రాథమిక దవాఖానలో గురువారం మానసిక వ్యాధిగ్రస్తులకు మానసిక వైద్యుడు రమణ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ వర్కర్ వంగ రాహుల్‌కుమార్, హెచ్‌ఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 20: పట్టణంలోని మోడల్ స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది గురువారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే సిబ్బంది మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా 12 మంది విద్యార్థులకు అద్దాలను రాసి ఇచ్చామని, అందుకు సంబంధించిన అద్దాలు రావడంతో మోడల్‌స్కూల్‌కు వెళ్లి అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సునీత, రవీందర్‌నాయక్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ గాంధీ, విద్యార్థులు ఉన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లింగంపేట, మార్చి 20: మండలంలోని ముంబాజీపేట తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో మంజూరైన నిధులతో తండాలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ బలరాంనాయక్, తండావాసులు పాల్గొన్నారు.

**వెల్లుట్లలో..**

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 20: మండలంలోని వెల్లుట్ల గ్రామంలో సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులు ప్రారంభించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా విడుదలైన 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గంట సాయిలు, భాస్కర్, రవి, స్వామి, శంకర్, సాయిలు తదితరులున్నారు.

## ఇందిరమ్మ గృహ నిర్మాణాల పరిశీలన

నాగిరెడ్డిపేట, మార్చి20: ప్రభుత్వం ఆదర్శ గ్రామంగా ఎంపికచేసిన అచ్చాయపల్లి గ్రామ పరిధిలోని రామక్కపల్లిలో చేపడుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణాలను ఎంపీడీవో ప్రభాకర్ గురువారం పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు.

## మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

పెద్దకొడప్‌గల్ (పిట్లం),మార్చి 20: పిట్లం మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఎస్సీ కార్పొరేషన్ వారి సౌజన్యంతో ఎస్సీ నిరుద్యోగ మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో మహిళలకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వారికి కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. అనంతరం హుస్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.